క్లుప్తంగా

స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించాలి


రోడ్డు ఆక్రమణలను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్సై

బేస్తవారిపేట: బేస్తవారిపేటలో 544–డి జాతీయ రహదారికి ఇరువైపులా ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించాలని తహసీల్దార్ జితేంద్రకుమార్ స్పష్టం చేశారు. బుధవారం జాతీయ రహదారి వెంట ఆక్రమణలను ఎస్సై రవీంద్రారెడ్డితో కలిసి పరిశీలించారు. కలెక్టర్, జేసీ ఆదేశాల మేరకు గురువారం రోడ్డుకు అవసరమైన స్థలాన్ని గుర్తించేందుకు కొలతలు వేస్తున్నట్లు తెలిపారు. కూరగాయలు, పండ్లు, దుకాణదారులు రోడ్డుపై అడ్డంకులు సృష్టించవద్దని చెప్పారు.

గెలుపోటములు సమానంగా తీసుకోవాలి


క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న ఎస్సైలు రవీంద్రారెడ్డి, నరసింహారావు

బేస్తవారిపేట: ఆటల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలని బేస్తవారిపేట, కంభం ఎస్సైలు ఎస్వీ రవీంద్రారెడ్డి, నరసింహారావు సూచించారు. బుధవారం స్థానిక జంక్షన్‌లో రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఎస్సైలు మాట్లాడుతూ.. ఆటల పోటీలతో విద్యార్థులు, యువత మధ్య స్నేహభావం పెరుగుతుందన్నారు. హరి ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో దాదాపు రూ.2 లక్షలు వెచ్చించి రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీలు ప్రశాంత వాతావరణంలో సాగాలని ఆకాంక్షించారు.

భక్తిశ్రద్ధలతో గాయత్రి యజ్ఞం


గాయత్రి యజ్ఞం నిర్వహిస్తున్న పరివార్ సభ్యులు

గిద్దలూరు రూరల్: గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా పట్టణంలోని కాశినాయన కుంటలోని గాయత్రి ఆలయంలో బుధవారం గాయత్రి యజ్ఞం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ ధ్యాన మందిరం నిర్వాహకులు పి.హనుమంతారెడ్డి మాట్లాడుతూ.. యజ్ఞం వల్ల సకల దేవతలు సంతోషిస్తారని చెప్పారు. యావత్తు మానవాళి సంరక్షణ కోసం ప్రతి ఒక్కరు యజ్ఞంలో పాల్గొనాలని కోరారు. భక్తి మార్గంలో పయనించడం వల్ల జీవితం ఆనందదాయకం అవుతుందన్నారు. కార్యక్రమంలో గాయత్రి పరివార్ సభ్యులు అంజనీకుమార్, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో దీర్ఘకాలిక ప్రయోజనాలే ముఖ్యం


మల్లవరం గ్రామసభలో పాల్గొన్న అధికారులు

పొదిలి రూరల్: ప్రతి గ్రామంలో పూడికతీత పనులకు ప్రాధాన్యత తగ్గించి, దీర్ఘకాలిక ప్రయోజనాలు కలిగే పనులను గుర్తించి లేబర్ బడ్జెట్ రూపకల్పన చేయాలని ఈఓఆర్డీ కృష్ణ పేర్కొన్నారు. బుధవారం పొదిలి మండలంలో ఉపాధి హామీ పథకం గ్రామ సభలు నిర్వహించారు. ముందుగా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పనుల గుర్తింపులో ప్రజల అభిప్రాయాలను, స్థానిక పరిస్థితులను పరిగణలోకి తీసుకోవాలని ఈఓఆర్డీ స్పష్టం చేశారు. ఏపీఓ టి.వెంకట్రావు, ఈసీ శివకుమార్, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు పాల్గొన్నారు.

వలస కూలీలకు ఉపాధి కల్పించాలి


కొమరోలు : మాట్లాడుతున్న జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు

కొమరోలు: వలస కూలీలకు మహాత్మ గాంధీ ఉపాధి హామీ పథకంలో పనులు కల్పించినట్లయితే వలసలు తగ్గే అవకాశం ఉందని కొమరోలు జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు తెలిపారు. మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ గ్రామసభలను మండలంలోని 14 గ్రామ పంచాయతీలలో ఆయా గ్రామసర్పంచ్‌ల అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. కొమరోలు సమావేశంలో జెడ్పీటీసీ మాట్లాడుతూ.. గ్రామ సభల ద్వారా పనులను గుర్తించి కూలీలకు ఉపాధి కల్పించాలన్నారు. స్థానికంగా ఉపాధి లేక చాలామంది కూలీలు వలస వెళ్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఓ మహాలక్ష్మి, వైస్ ఎంపీపీ మౌలాలి, ఎంపీటీసీలు సుభాని, తిరుపతిరాజు తదితరులు పాల్గొన్నారు.


జీజీహెచ్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేసున్న వికాస్ స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, వైద్యశాల సిబ్బంది


ప్రతిజ్ఞ చేస్తున్న కమిషనర్ నగర పంచాయతీ సిబ్బంది, ఇతరులు


కొమరోలు : మహాత్మ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య ప్రముఖులు

మహాత్ముని ఆశయాలు కొనసాగిద్దాం

- ఘనంగా జాతిపిత మహాత్మా గాంధీ జయంతి

మార్కాపురం టౌన్: మహాత్మా గాంధీ జయంతిని మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. మార్కాపురం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో చైర్మన్ బాలమురళీకృష్ణ, మున్సిపల కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, ఎమ్మెల్యే సోదరుడు కందుల రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టణ పోలీస్‌స్టేషన్‌లో..

మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను పట్టణ పోలీసు స్టేషన్‌లో సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణ, రూరల్ ఎస్సైలు సైదుబాబు, అంకమరావు, సిబ్బంది పాల్గొన్నారు. పట్టణంలోని ఓం సాయి వికాస్ విద్యానికేతన్‌లో గాంధీ జయంతి ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని గడియార స్తంభం సెంటరులోని గాంధీ పార్కులోని మహాత్మా గాంధీ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మార్కాపురం పట్టణంలోని జీజీహెచ్‌లో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ శ్రీనివాస్, నర్సింగ్ స్టాఫ్, స్టాఫ్ నర్సులు, వైద్యశాల సిబ్బంది, ఓం సాయి వికాస్ విద్యానికేతన్ ఇన్‌చార్జి జి ఉమాకుమారి పాల్గొన్నారు.

కొనకనమిట్ల: మహాత్మా గాంధీ ఆశయాలతో ముందుకు సాగుదామని పలువురు అన్నారు. బుధవారం మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా మండలంలోని వాగుమడుగు గ్రామ సచివాలయంలో సర్పంచ్ భూదాల కమలాకర్ ఆధ్వర్యంలో గాంధీజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో, గొట్లగట్టు, కొనకనమిట్ల, పెదారికట్ల, వాగుమడుగు, నాగంపల్లి, మునగపాడు, చినారికట్ల గ్రామాల్లో జరిగిన గాంధీ జయంతి వేడుకల్లో ఆయా సర్పంచ్‌లు, సచివాలయ కార్యదర్శులు మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


బేస్తవారిపేటలో గాంధీజీ చిత్రపటానికి ఎంపీడీఓ రంగనాయకులు


మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి జయంతి వేడుకలు నిర్వహిస్తున్న తహశీల్దార్

గిద్దలూరు రూరల్: మహాత్మాగాంధీతో పాటుగా లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి వేడుకలను గిద్దలూరులో బుధవారం ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రీ చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నిర్వహించారు. స్థానిక నగర పంచాయతీ కమిషనర్ డి.వెంకటదాస్ ఆధ్వర్యంలో కార్యాలయం వద్ద నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ నిర్వహించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో సీఐ కె.సురేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది మహాత్ముల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రజా సంకల్ప వేదిక ఆధ్వర్యంలో బీసీ నాయకుడు ఓ.వెంకటయ్యయాదవ్ పీఆర్. కాలనీలోని వృద్ధాశ్రమంలో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, కౌన్సిలర్లు బి.చంద్రశేఖర్‌యాదవ్, లొక్కురమేష్, వీఆర్ఓలు వై.పి.రంగయ్య, ఈశ్వర్‌రెడ్డి, నగర పంచాయతీ ఏఈ రవీంద్రుడు పాల్గొన్నారు.

ఘనంగా గాంధీజీ జయంతి వేడుకలు

బేస్తవారిపేట: స్థానిక బస్టాండ్ ఆవరణలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, పంచాయతీ కార్యాలయంలో, గ్రంథాలయంలో, ఎంపీడీఓ కార్యాలయంలో గాంధీజీ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రంగనాయకులు, ఎన్ఆర్ ఈజీఎస్ ఏపీఓ గురువరకుమార్, ఈఓపీఆర్డీ రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి నరేంద్ర పాల్గొన్నారు.

గాంధీజీకి ఘన నివాళి

కంభం: గాంధీ జయంతిని పురస్కరించుకొని బుధవారం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బైసాని రామకృష్ణ ఆధ్వర్యంలో గాంధీబజార్ లో ఉన్న మహాత్మగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పోలీస్ స్టేషన్ లో ఎస్సై నరసింహారావు, సిబ్బంది గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొమరోలు: మహాత్మగాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం కొమరోలు పట్టణంలోని పోలీసు స్టేషన్‌లో ఎస్సై వెంకటేశ్వర్లునాయక్ మహాత్మగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే కొమరోలులోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆవరణలో మహాత్మగాంధీ విగ్రహానికి, గ్రామపంచాయతీ కార్యాలయంలోని మహాత్మగాంధీ విగ్రహానికి ఆర్యవైశ్య ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కపల్లి ఎంపీపీ పాఠశాలలో మాజీ వైస్ ఎంపీపీ చిన్న ఆంజనేయులు మహాత్మగాంధీ విగ్రహానికి నివాళులు అర్పించారు.

రాచర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి ఎంపీపీ షేక్ ఖాశింబీ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరామిరెడ్డి, రాచర్ల సర్పంచ్ సగినాల రాయలమ్మ, ఏపీవో మోసే, యూఆర్డీ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరనాయక్, షేక్.ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని చినగానిపల్లెలో గాంధీ చిత్రపటానికి జెడ్పీటీసీ పగడాల దేవి ఘనంగా నివాళుర్పించారు. అనంతరం చిన్నారులకు స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో చోళ్లవీడు, చినగానిపల్లె సర్పంచులు గోతం నారాయణ, పగడాల రమేష్, మాజీ సర్పంచులు ముత్యాల మధుసూదన్‌రావు, కన్నసాని ఓబులేసు, ఎంపీటీసీ నందం రవి, వైఎస్సార్ సీపీ నాయకులు పగడాల శ్రీరంగం, కృష్ణయ్య, ముత్యాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


తర్లుపాడు ఎంపీడీఓ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎంపీపీ, అధికారులు

పొదిలి: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై వేమన, రెవెన్యూ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఆర్‌ఐ కె.సుబ్బారావు, వీఆర్‌ఓలు, శ్రీవివేకానంద విద్యా సంస్థల్లో డైరెక్టర్లు కేవీ రమణారెడ్డి, వై.వెంకటేశ్వరరావు, బిట్స్ విద్యాసంస్థల్లో కరస్పాండెంట్ బెల్లంకొండ శ్రీనివాసరావు, డైరెక్టర్ బెల్లంకొండ విజయలక్ష్మి, వాసవి అమ్మవారిశాల, పాత పంచాయతీ కార్యాలయం, పలు పాఠశాలల్లో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు మహాత్ముడికి నివాళులర్పించారు.

తర్లుపాడు: మండలంలోని గ్రామాల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. గాంధీ సిద్ధాంతాలైన శాంతి, సహనం, అహింసను నేటి యువత అలవర్చుకోవాలని వక్తలు సూచించారు. తర్లుపాడు గాంధీ పార్కులోని మహాత్ముని విగ్రహానికి ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు జగన్‌బాబు ఆధ్వర్యంలో, నెహ్రూ యూత్ అధ్యక్షుడు పుల్లయ్య ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.


రాచర్ల : గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ ఖాశింబి


వాగుమడుగులో గాంధీ చిత్ర పటానికి పూలమాలలు


పొదిలిలో మహాత్ముడికి నివాళులర్పిస్తున్న ఎస్సై వేమన


పొదిలి తహసీల్దార్ కార్యాలయంలో..


పొదిలి బిట్స్ కళాశాలలో..

పారిశుధ్య కార్మికులకు సన్మానం

మార్కాపురం రూరల్: మండలంలోని నికరంపల్లి, బొడిచర్ల గ్రామాల్లో ఏర్పాటు చేసిన జాతీయ ఉపాధి హామీ గ్రామ సభలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిపాల్గొన్నారు. ముందుగా గాంధీ మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వచ్ఛ భారత్ మిషన్ పదేళ్ల పూర్తయిన సందర్భంగా ఆయా గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ భాగ్యవతి, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కందుల, ఇన్‌చార్జి ఎంపీడీఓ భాగ్యవతి

బీజేపీ విధానాలతో దేశాభివృద్ధి తిరోగమనం

- గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నేతల వినతిపత్రం

మార్కాపురం: బీజేపీ అనుసరిస్తున్న ఫాసిస్టు విధానాలు దేశాన్ని అభివృద్ధిలో వెనక్కు తీసుకెళ్తున్నాయని మార్కాపురం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సయ్యద్ జావీద్ అన్వర్ విమర్శించారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం స్థానిక గాంధీ పార్కులో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తోందని, దీంతో మత విద్వేషాలు ఎక్కువవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ తీరు మారకుంటే జనాగ్రహాన్ని చవిచూస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో గాలి వెంకటరామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, హమీద్, ఇస్మాయిల్, రిజ్వాన్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.


గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

విశాఖ ఉక్కును ప్రైవేటీకరించొద్దు

- కంభంలో సీఐటీయూ నాయకుల నిరసన

కంభం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొండి వైఖరిని విడనాడి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రయత్నాలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ నాయకులు అన్వర్, ఖాజావలి డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో భవన నిర్మాణ, ఆటోయూనియన్, ముఠా పలక రిక్షా యూనియన్ నాయకులతో కలిసి కందులాపురం కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ముందుగా గాంధీ జయంతిని పురస్కరించుకొని మహాత్మగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమాలకు సంఘీభావంగా కంభంలో నిరసన చేపట్టినట్లు తెలిపారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నాయన్నారు. ఈనెల 3వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. ఉక్కు పరిశ్రమ కోసం 12 గ్రామాల ప్రజలు 25వేల ఎకరాల భూమిని త్యాగం చేశారని, ప్లాంటును కాపాడుకోడానికి 32 మంది ప్రాణత్యాగం చేశారని, అటువంటి ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించే హక్కు ఎవరికీ లేదన్నారు. ప్రభుత్వం మొండి వైఖరిని వీడకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు దానం, కొత్తూరు, మహబూబ్ బాషా, వెంకటేశ్వర్లు, చెన్నయ్య, పాపయ్య, శ్రీను, సుబ్బయ్య, రసూల్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



కంభంలో నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

నేటి నుంచి దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు

గిద్దలూరు రూరల్: దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను గురువారం నుంచి 12 వ తేదీ వరకు నిర్వహించేందుకు గిద్దలూరులో వివిధ ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశాయి. పట్టణంలోని శ్రీ వాసవి కన్యాక పరమేశ్వరి ఆలయం, నల్లబండ బజారులోని కనకదుర్గమ్మ ఆలయం, కాశినాయన కుంటలోని గాయత్రిదేవి ఆలయం, వీరన్న బావి సమీపంలో కాళికాంబ ఆలయం, అంకాలమ్మ బజారులోని అమ్మవారి ఆలయంలో నవరాత్రి మహోత్సవాల సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేయనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

సబ్‌జైలును తనిఖీ చేసిన జడ్జి


ఖైదీలకు పండ్లు అందిస్తున్న జడ్జి బాలాజీ

మార్కాపురం: మార్కాపురం సబ్ జైలును బుధవారం అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.బాలాజీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షణికావేశానికి లోనై నేరాలకు పాల్పడవద్దని ఖైదీలకు సూచించారు. బెయిల్‌పై బయటకు వెళ్లిన అనంతరం కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా జీవించాలని చెప్పారు. బెయిల్ పొందేందుకు అర్హులై ఉండి న్యాయవాదిని పెట్టుకోలేని వారు మండల న్యాయసేవాధికార సంస్థకు అర్జీ ఇస్తే ఉచితంగా న్యాయవాదిని నియమిస్తారని తెలిపారు. గాంధీ మార్గాన్ని అనుసరించాలని తెలిపారు. ప్యానల్ న్యాయవాది కడియం రామయ్య, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ శ్రీనివాస్ వెంట ఉన్నారు. రిమాండ్ ఖైదీలకు పెట్టే ఆహార పదార్థాలను ఆయన పరిశీలించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు.

నేటి నుంచి ముద్దసానమ్మ ఆలయంలో దసరా నవరాత్రులు

మార్కాపురం రూరల్: మార్కాపురం మండలం జమ్మనపల్లి గ్రామం వద్ద వెలసిన ముద్దసానమ్మ అమ్మవారి దసరా నవరాత్రులు ఈనెల 3 నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన భక్త బృందం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. రోజూ ఉదయం 6 గంటలకు అభిషేకం, అలంకరణ, అర్చన, ప్రతి రోజూ సాయంత్రం 6 గంటలకు అమ్మవారి లలితా సహస్రనామం, ఖడ్గమాల సహిత పూజ, భజన, నవహారతులను నిర్వహిస్తామని వివరించారు. 6వ తేదీ ఉదయం 10 గంటలకు సామూహిక కుంకుమార్చన పూజ నిర్వహిస్తామని తెలిపారు.

దసరా ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి


మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు

కంభం: దసరా ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు సూచించారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పండుగలను, ఉత్సవాలను అందరూ సంతోషంగా నిర్వహించుకోవాలని తెలిపారు. ఇతర మతాలను గౌరవిస్తూ ఎవరికీ ఇబ్బంది లేకుండా ఉత్సవాలు నిర్వహించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐ మల్లికార్జున, ఎస్సై నరసింహరావు, పట్టణంలో అన్ని మతాల పెద్దలు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో అన్నదానం


అన్నదానం చేస్తున్న ఉభయదాతలు

పొదిలి: స్థానిక అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో పేదలకు ప్రతి బుధవారం అన్నదానం నిర్వహిస్తున్నారు. శనగపల్లి లక్ష్మీ నాగేశ్వరరావు, మల్లీశ్వరి, వంశీకృష్ణ, కృష్ణవేణి దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించి అన్నదానం చేశారు. ముందుగా ఉభయదాతలు అయ్యప్ప స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారి మురళీచార్యులు, గురుస్వాములు యక్కలి శేషగిరిరావు, అప్పల శంకర్‌రావు, పానుగుపాటి కోటేశ్వరరావు, గంజి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం టెండర్లకు ఆహ్వానం

గిద్దలూరు రూరల్: మద్యం దుకాణాలకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు గిద్దలూరు ఎక్సైజ్ సీఐ ఎం.జయరావు తెలిపారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయన బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గిద్దలూరు నగర పంచాయతీలో 5 దుకాణాలు, గిద్దలూరు రూరల్ పరిధిలో 3, రాచర్ల 2, కొమరోలు మండలంలో 3 దుకాణాలకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుదారులు రూ.2 లక్షలు డీడీ రూపంలో చెల్లించి టెండర్లలో పాల్గొనాలని స్పష్టం చేశారు. 10వ తేదీన దరఖాస్తుల స్క్రూటినీ, 11వ తేదీన కలెక్టర్ సమక్షంలో డ్రా తీసి షాపులు కేటాయించనున్నట్లు చెప్పారు. 12వ తేదీన దుకాణాలు ప్రారంభవుతాయని పేర్కొన్నారు.

పొదిలి సర్కిల్‌లో 16 మద్యం దుకాణాలు


పొదిలి: పొదిలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మొత్తం 16 మద్యం దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చని సీఐ అరుణకుమారి బుధవారం విలేకరులకు వెల్లడించారు. పొదిలి పట్టణ పరిధిలో 5, రూరల్‌లో 2, కొనకనమిట్ల మండల పరిధిలో 3, మర్రిపూడి 2, తర్లుపాడు 2, హనుమంతునిపాడు మండల పరిధిలో 2 దుకాణాల చొప్పున ఏర్పాటు చేసుకోవచ్చని వివరించారు. పొదిలి పట్టణ, రూరల్ పరిధిలో లైసెన్సు ఫీజు రూ.65 లక్షలు కాగా, మిగిలిన కొనకనమిట్ల, తర్లుపాడు, మర్రిపూడి, హనుమంతునిపాడు మండలాల్లోని ఒకొక్క దుకాణానికి రూ.55 లక్షలు లైసెన్సు ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. దుకాణాలు పొందిన వారు వారి మండలాల పరిధిలో ఎక్కడైనా దుకాణం ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో లేదా ఎక్సైజ్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జంకెను పరామర్శించిన సురేష్, అన్నా


జంకెను పరామర్శిస్తున్న సురేష్, అన్నా రాంబాబు

మార్కాపురం: వైఎస్సార్ సీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డిని ఆయన నివాసంలో బుధవారం రాత్రి మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, మాజీ ఎమ్మెల్యే మార్కాపురం ఇన్‌చార్జి అన్నా రాంబాబు పరామర్శించారు. జంకె వెంకటరెడ్డి ఇటీవల వైరల్ జ్వరంతో ఇబ్బందిపడి హైదరాబాద్‌లో చికిత్స చేయించుకుని వచ్చారు. ఈ నేపథ్యంలో ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ షంషేర్ ఆలీబేగ్, తర్లుపాడు మండల పార్టీ అధ్యక్షులు మురారి వెంకటేశ్వర్లు తదితరులు జంకెను పరామర్శించి మాట్లాడారు.

కారు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన కోటయ్య

తర్లుపాడు: మండలంలోని కలుజువ్వలపాడు వాటర్ ట్యాంకు సమీపంలో స్కూటర్‌ను కారు ఢీకొన్న ఘటనలో గ్రామానికి చెందిన శిరిపురపు కోటయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో అంబులెన్స్‌లో క్షతగాత్రుడిని మార్కాపురం జీజీహెచ్‌కు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా కారు బోల్తా కొట్టడంతో అందులో ఉన్నవారికి స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు ప్రారంభించారు.